సాక్షి మంచిర్యాల

శనివారం । 30 । సెప్టెంబర్ । 2023



'గుర్తింపు' ఎన్నికలు జరిగేనా?

ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటికీ సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ఒత్తిడితో యాజమాన్యం సుప్రీంకోర్టుకు వెళ్లే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. 8లో▸



క్యాంపస్ నుంచే కొలువు

బాసర ట్రిపుల్ఐటీ ఎంతోమంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలకు బాటలు వేస్తోంది. తాజాగా ప్లేస్‌మెంట్‌లో రాణించిన కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థులు కార్పొరేట్ ఉద్యోగాలు సాధించారు. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
32.4 /25.5

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అక్రమ కట్టడాల తొలగింపు



అక్రమ కట్టడాలను తొలగిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

నస్పూర్: పట్టణ పరిధిలోని పలు ప్రభుత్వ భూముల లో నిర్మించిన అక్రమ కట్టడాలపై ఈ నెల 11న సాక్షిలో 'సెలవు రోజు అక్రమ నిర్మాణాల జోరు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. నస్పూర్ శివారు సర్వే నంబర్ 42లోని పలు అక్రమ కట్టడాలను జేసీబీ సహాయంతో శుక్రవారం తొలగించారు. కలెక్టర్, ఆర్డీవో ఆదేశాల మేరకు మండల టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో అక్రమ కట్టడాలను తొలగించినట్లు అధికారులు తెలిపారు.

గూడెంలో భాద్రపద పౌర్ణమి జాతర



సత్యదేవున్ని దర్శించుకుంటున్న భక్తులు..

దండేపల్లి: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన దండేపల్లి మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో శుక్రవారం భాద్రపద పౌర్ణమి జాతర ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి సత్యదేవున్ని దర్శించుకున్నారు. 110 జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. కర్ణమామిడికి చెందిన గాడిపెల్లి వెంకటేశ్, శ్రీరాంపూర్‌కు చెందిన బిడారి కిరణ్ కుమార్ సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అనిత

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని పాతమంచిర్యాల పట్టణ బాలుర పాఠశాలలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై శుక్రవారం అవగాహన కల్పించారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అనిత మాట్లాడుతూ జిల్లాలో అధికంగా నమోదవుతున్న డెంగీ, విషజ్వరాల బారిన పడకుండా, దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పాఠశాల, హాస్టల్ పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు.

నేడు డయల్ యువర్ డీఎం

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల డిపో పరిధిలోని ఆయా గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో ప్రయాణికుల సమస్యలు పరిష్కరించేందుకు శుక్రవారం డయల్ యువర్ డీఎం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ రవీంద్రనాథ్ తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 99592 26004 నంబర్‌కు ఫోన్‌చేసి సమస్యలు తెలియజేయాలని సూచించారు. సలహాలు, సూచనలు కూడా ఇవ్వొచ్చని పేర్కొన్నారు.

నేడు జెడ్పీ స్థాయి కమిటీల సమావేశం

మంచిర్యాలటౌన్: జిల్లా పరిషత్ స్థాయికమిటీల సమావేశం శనివారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో కె.నరేందర్ తెలిపారు. ఏడు స్థాయి కమిటీల సమావేశాలు సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

మెడికల్ కార్డుకు అవకాశం

శ్రీరాంపూర్: సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు, మెడికల్ అన్‌ఫిట్ అయిన ఉద్యోగులు మెడికల్ కార్డు (సీపీఆర్ఎంఎస్ స్కీం) పొందడానికి మరోసారి దరఖాస్తులకు అవకాశం కల్పించినట్టు శ్రీరాంపూర్ డీజీఎం(పర్సనల్) అరవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు ఈ కార్డును తీసుకోని వారికి ఈ అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న కార్మికులు ఇదివరకు పనిచేసిన గనులు డిపార్టుమెంట్లలో సంక్షేమ అధికారులను సంప్రదించాలని తెలిపారు.

టికెట్లపై తలో చేయి

- కాంగ్రెస్ పార్టీలో పెరుగుతున్న ఆశావహులు
- సిట్టింగ్ ఎమ్మెల్యేల రాకతో మారుతున్న పరిణామాలు
- జాబితా వెలువడే వరకు నాయకుల్లో ఉత్కంఠ



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కాంగ్రెస్ పార్టీలో అభ్యర్థులు ఖరారు కాకపోవడంతో అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎవరికి వారే అన్నట్లుగా ప్రచారం సాగిస్తున్నారు. ఆశావహులు తమకున్న మార్గాల్లో లాబీయింగ్ చేస్తూనే ఉన్నారు. పార్టీలో ఇంకా అభ్యర్థుల ఎంపికకు కసరత్తు సాగుతూనే ఉంది. గాంధీ భవన్, ఢిల్లీ కేంద్రంగా ఎంపిక కమిటీలు, ప్రత్యేక బృందాలు తలమునకలై ఉన్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాలకు మొత్తం 94మంది టికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరితో పాటు ఇటీవల పార్టీలో చేరిన వారు సైతం టికెట్లు ఆశిస్తున్నారు. ఎన్నికల సమయం సమీపిస్తున్న కొద్దీ ఆశావహుల్లో ఉత్కంఠ పెరుగుతోంది. ఇప్పటికే నియోజకవర్గానికి మూడు పేర్లు చొప్పున పరిశీలనకు వెళ్లాయి. అధికార పార్టీ నుంచి అసంతృప్తులు, మాజీ ప్రజాప్రతినిధులు చేరడంతో జాబితా రూపకల్పనలో మార్పులు, చేర్పులు జరిగే అవకాశం లేకపోలేదు. రాష్ట్రం యూనిట్‌గా బీసీ, ఓసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీలు, ఉప కులాలను లెక్కలోకి తీసుకున్నప్పుడు ఏ స్థానం ఏ సామాజిక వర్గానికి దక్కనుందోనని ఉత్కంఠ కొసాగుతోంది. దీంతో ఎవరికి వారే లాబీయింగ్ చేస్తున్నారు. పీసీసీతోపాటు ఏఐసీసీ వరకు మంతనాలు సాగిస్తున్నారు.

ఎవరికీ దక్కని హామీ

ఉమ్మడి జిల్లా నుంచి పార్టీ ఎన్నికల వ్యూహ కమిటీ చైర్మన్‌గా కీలక హోదాలో ఉన్న మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు(పీఎస్సార్)కు మంచిర్యాల టికెట్ ఖాయమని ఆయన అనుచరులు చెబుతున్నారు. అయితే ఇక్కడ కేవీ.ప్రతాప్‌తోపాటు బీసీ నాయకులున్నారు. చెన్నూరు నుంచి ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, ఆయన సతీమణి మంచిర్యాల జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి టికెట్ ఆశిస్తున్నారు. ఇదే స్థానానికి మాజీ మంత్రి బోడ జనార్దన్, డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాస్, ఆయన సతీమణి విద్యావతి, డాక్టర్ రాజారమేశ్, ఓయూ విద్యార్థి నాయకుడు దుర్గం భాస్కర్, నేతకాని సంఘం నాయకుడు దుర్గం అశోక్, రామిళ్ల రాధిక తదితరులు టికెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఇక బెల్లంపల్లి నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి గడ్డం వినోద్, చిలుముల శంకర్, న్యాతరి స్వామితోపాటు మరో ఏడుగురు అభ్యర్థులు ఉన్నారు.

ఖానాపూర్, బోథ్‌లో మారిన సీన్

ఖానాపూర్, బోథ్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ వైపు చూడడంతో ఒక్కసారిగా ఇక్కడ సీన్ మారింది. ఖానాపూర్ నుంచి రేఖానాయక్, ఆమె భర్త శ్యామ్‌నాయక్ ఆసిఫాబాద్ నుంచి ఇద్దరూ టికెట్లు ఆశిస్తున్నారు. ఒకవేళ సిట్టింగ్ ఎమ్మెల్యేకు టికెట్ ఇచ్చినా, తనకు కూడా ఇవ్వాలని శ్యామ్‌నాయక్ పట్టుబడుతున్నారు. ఢిల్లీలోనే లాబీ యింగ్ చేస్తున్నారు. బోథ్ సిట్టింగ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు కాంగ్రెస్‌లో చేరితే, ప్రధాన పోటీదారు కానున్నారు. ఇక్కడ 18మంది దరఖాస్తులు ఇచ్చారు. వీరిలో డాక్టర్ జాదవ్ నరేశ్, అడె గజేందర్ ఉన్నారు. నిర్మల్ నుంచి కూచాడి శ్రీహరిరావు, పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి ఉన్నారు. సిర్పూర్‌లో రావి శ్రీనివాస్, ముథోల్‌లో షిండే ఆనంద్‌రావు, పి.విజయ్‌కుమార్‌రెడ్డితోపాటు మరో ఇద్దరున్నారు. ఈ నియోజకవర్గాల్లో బలమైన అభ్యర్థుల కోసం వేట కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు పార్టీకి అవసరమైన చోట అధికార, విపక్ష పార్టీల నాయకులను పార్టీలో చేర్చుకునేందుకు మంత్రాంగం సాగుతోంది. ఇప్పటికే పలువురు తాజా, మాజీ ప్రజాప్రతినిధులతోనూ సంప్రదింపులు జరిపినట్లు సమాచారం.

జీవితంలో విలువైంది ఆరోగ్యమే



2కే రన్ ప్రారంభిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే దివాకర్‌రావు, క్రీడాకారిణి నైనా జైశ్వాల్

- కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాలటౌన్: మానవ జీవితంలో అన్నింటికంటే విలువైనది ఆరోగ్యమేనని, ఎంత సంపద ఉన్నా ఆరోగ్యానికి తీసిరాదని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా నుంచి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానం వరకు శుక్రవారం 2కే రన్ నిర్వహించారు. అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైశ్వాల్, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లితో కలిసి కలెక్టర్ 2కే రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా హార్ట్ సింబల్ బెలూన్లను గాల్లోకి వదిలి గుండెను పదిలంగా చూసుకోవాలనే సందేశాన్ని ఇచ్చారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో శారీరక శ్రమ లేకపోవడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోకపోవడం, వ్యాయామం చేయక పోవడంతో గుండె సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ నిత్యం వ్యాయామం చేయాలని సూచించారు. నడక, యోగ నిత్య జీవితంలో భాగం కావాలని తెలిపారు. జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని, పౌష్టికాహారం తీసుకోవాలని పేర్కొన్నారు. రోజువారీ ఆహారంలో కూరగాయలు, పండ్లు, కార్బోహైడ్రేట్‌లు, ఇతర పోషక పదార్థాలు ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం 2కే రన్‌లో కలెక్టర్ పాల్గొన్నారు.

ప్రతీ మహిళకు బతుకమ్మ చీర

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రతి సంవత్సరం బతుకమ్మ పండగ సందర్భంగా ప్రభుత్వం అందించే బతుకమ్మ చీరలను ఈసారి కూడా జిల్లాలోని అర్హత గల ప్రతీ మహిళకు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. సమీకృత కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి. శేషాద్రి, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు రాములు, సురేష్‌తో కలిసి తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్ 4 నుంచి చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించాలని తెలిపారు. ప్రతీరోజు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పంపిణీ వివరాల నివేదిక అందించాలని తెలిపారు. రేషన్ దుకాణాల డీలర్లకు తగు సూచనలు చేయాలని, తప్పనిసరిగా రిజిస్టర్ నిర్వహించాలని తెలిపారు. ప్రతీరోజు నివేదిక అందించేలా ఆదేశాలు ఇవ్వాలన్నారు.

మంత్రి పర్యటనకు ఏర్పాట్లు

- పరిశీలించిన విప్ బాల్క సుమన్
- అధికారులకు సూచనలు



అధికారులకు సూచనలు చేస్తున్న విప్ సుమన్

మందమర్రిరూరల్: రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అక్టోబర్ 1న మందమర్రి మున్సిపాలిటీ పర్యటనకు వస్తున్నారు. పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. ఈమేరకు ఏర్పాట్లను ప్రభుత్వ విప్ బాల్క సుమన్, కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్, డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్‌తో కలిసి శుక్రవారం ఏర్పాట్లు పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అంతకు ముందు ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రావు, జెడ్పీటీసీ వేల్పుల రవి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

సదరం సర్టిఫికెట్ ఇప్పించాలని వినతి...

తలసేమియా, సికిల్‌సెల్, హిమోఫీలియా వ్యాధిగ్రస్తులకు సదరం సర్టిఫికెట్ ఇప్పించాలని తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్‌కుమార్ ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌ను కోరారు. క్యాతన్‌పల్లిలో ప్రభుత్వ విప్ బాల్క సుమన్‌ను శుక్రవారం కలిసి ఈమేరకు విన్నవించారు. రాష్ట్రవ్యాప్తంగా వ్యాధిగ్రస్తులు ఐదువేల మంది ఉన్నారని, అందరినీ దివ్యాంగులుగా గుర్తించి సదరం సర్టిఫికెట్ జారీ చేసేలా చర్య తీసుకోవాలని కోరారు. సమస్యను ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలని విన్నవించారు.

'మధ్యాహ్నా'నికి బ్రేక్

- సమ్మెలో కార్మికులు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో ఉపాధ్యాయులు



ఎంఈవో ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

మంచిర్యాలఅర్బన్: సర్కారు బడుల్లో మధ్యాహ్న భోజనం నిలిచిపోయింది. కార్మికులు సమ్మెబాట పట్టారు. దీంతో శుక్రవారం బడుల్లో తాత్కాలిక వంట మనుషులను ఏర్పాటు చేయడంతోపాటు.. తక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో ఇంటి నుంచి బాక్స్ తెచ్చుకునేలా ఉపాధ్యాయులు ఏర్పాట్లు చేశారు. పెంచిన గౌరవ వేతనం చెల్లింపుల్లో జాప్యం.. జీవో ప్రకారం పెండింగ్ ఏరియర్స్‌కు డిమాండ్ చేస్తున్నారు. కొత్త మెనూకు అనుగుణంగా బడ్జెట్ పెంచాలని కార్మికులు విధులు బహిష్కరించారు.

డిమాండ్లు ఇవీ..

తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో సమ్మెకు దిగారు. కార్మికులు వంట నిలిపివేసి ఆందోళన చేపట్టారు. ఇప్పటికే హెచ్ఎంలు, విద్యాశాఖ అధికారులకు నోటీసులు అందజేశారు. సమస్యల పరిష్కారంపై స్పందించకపోవటంతో సమ్మె చేపట్టినట్లు కార్మికులు చెబుతున్నారు. పెరిగిన నిత్యావసరాలు, కూరగాయల ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. వంటగ్యాస్ సిలిండర్లు, పాత్రలను ప్రభుత్వమే సమకూర్చాలని కోరుతున్నారు. ప్రమాద బీమా రూ.10 లక్షలు చెల్లించాలని, గుర్తింపు కార్డులు, హెల్త్‌కార్డులు ఇవ్వాలని సూచిస్తున్నారు.

ఎంఈవో ఆఫీసుల ఎదుట ధర్నా..

సమ్మెలో భాగంగా శుక్రవారం ఎంఈవో కార్యాలయాల ఎదుట కార్మికులు ధర్నా చేశారు. మంచిర్యాల ఎంఈవో కార్యాలయం ఎదుట తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మిక సంఘం(సీఐటీయూ) జిల్లా అధ్యక్షురాలు రాజేశ్వరి మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. పెరిగిన వేతనాలు, పెండింగ్ సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో హాజీపూర్, మంచిర్యాల, నస్పూర్ మండలాల మధ్యాహ్న భోజన కార్మికులు పద్మ, రఫియా, కళావతి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ మంజూరు..

ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన రూ.2 వేల గౌరవ వేతనం, కుకింగ్ కాస్ట్, కోడిగుడ్డు బిల్లులకు సంబంధించిన బడ్జెట్ మంజూరు చేశాం. మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఎంఈవోలు, హెచ్ఎంలకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం.

– యాదయ్య, డీఈవో, మంచిర్యాల

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ



వీల్‌చైర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో విద్యాశాఖ, అలింకో సంస్థ ఆధ్వర్యంలో కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్, ఎమ్మెల్యే దివాకర్‌రావు దివ్యాంగులకు శుక్రవారం ఉపకరణాలు పంపిణీ చేశారు. జిల్లాలో 0–18 ఏళ్లలోపు వివిధ లోపాలతో బాధపడుతున్న వారిని గుర్తించి 191 మంది దివ్యాగులకు 291 పరికరాలు పంపిణీ చేశారు. 78 వినికిడి పరికరాలు 25 చక్రాల కుర్చీలు, 36 సీపీ కుర్చీలు, 16 రొలేటర్స్ 20 చంక కుర్చీలు, 5 బ్రెయిలీ కిట్స్, 2 సుకన్య కేన్ కిట్స్, 93 ఎంఎస్ఐ ఈడీ కిట్స్, 9 ఫుట్ ఆర్థోసిస్‌లు పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపునకు అలింకో అందించిన ఉచిత ఉపకరణాలుఎంతో ఉపయోగపడతాయన్నారు. ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పింఛన్ రూ.4 వేలు ఇస్తుందని తెలి పారు. డీఈవో యాదయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారులు చౌదరి, సత్యనా రాయణమూర్తి, శ్రీనివాస్, రాజ్‌కుమార్, డీఎస్‌వో మధుబాబు, మంచిర్యాల డీఈవో పోచయ్య, 18 మండలాల ఐఈఆర్పీలు, దివ్యాంగుల పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వేంపల్లిలో డెంగీ కలకలం



వేంపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో పరిస్థితులపై ఆరా తీస్తున్న వైద్యులు

- గ్రామంలో 8 మందికి జ్వరం
- మండలంలో 13 మందికి..
- పీహెచ్‌సీలో ప్రత్యేక వైద్య పరీక్షలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలో శుక్రవారం ఒక్కరోజులోనే 13 డెంగీ కేసులు నమోదయ్యాయి. సమాచారం అందుకున్న జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అనిత హాజీపూర్ పీహెచ్‌సీని సందర్శించి చికిత్స పొందుతున్న బాధితులతో మాట్లాడారు. వారి ఆరోగ్య పరిస్థితులు ఆరా తీశారు. పీహెచ్‌సీ పరిధిలో 13 డెంగీ కేసులు నమోదు కాగా ఒక్క వేంపల్లిలో 8 డెంగీ కేసులు నమోదు కావడంతో డాక్టర్ అనితతో పాటు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లహరి వేంపల్లిలో ఇంటింటా పర్యటించి అనారోగ్యంతో బాధపడుతున్నవారి వివరాలు తెలుసుకున్నారు. అనుమానితుల రక్త నమూనాలను సేకరించారు. వేంపల్లి పంచాయతీ ఆవరణలో డెంగీపై స్థానికులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ వోలపు శారద, కార్యదర్శి ప్రతిభతో కలిసి వైద్యులు అనిత, లహరి డెంగీ నివారణకు తీసుకునే జాగ్రత్తలు వివరించారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



ప్రిన్సిపాల్, అధ్యాపకులతో విద్యార్థులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీలు ఈనెల 28న సోమగూడెంలో జరిగాయి. అండర్–19 విభాగంలో జరిగిన పోటీల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జె.మణికంఠ, డి.తిరుపతి, ఆర్.సంతోష్, జె.ప్రభాస్, ఎస్.సాయికిరణ్ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్ అంజయ్య, పీడీ బాబురావు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలు సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో ఈనెల 30 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. ఆ పోటీల్లోనూ సత్తా చాటాలని ఆకాంక్షించారు.

పంచాయతీ ఆపరేటర్ల సమ్మె



వినతిపత్రం ఇస్తున్న నాలుగో తరగతి ఉద్యోగులు

మంచిర్యాలఅగ్రికల్చర్: సమస్యలు పరిష్కరించాలని పంచాయతీ టెక్నికల్ వింగ్ కంప్యూటర్ ఆపరేటర్లు కలెక్టరేట్ ఎదుట శుక్రవారం సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఆపరేటర్లు మాట్లాడుతూ జిల్లాస్థాయిలో పనిచేస్తున్న ప్రాజెక్టు మేనేజర్లు పేస్కేల్ అమలు చేసి భద్రత కల్పించాలని, ఈ పంచాయతీ అపరేటర్లకు జూనియర్ అసిస్టెంట్ పేస్కేల్ అమలుచేసి ప్రత్యేక గ్రాంట్ ద్వారా వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఆరోగ్య బీమా, ఆరోగ్య భద్రతను కల్పించాలన్నారు. ఉద్యోగి మరణిస్తే కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వాలని కోరారు. సమ్మెలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సురేందర్, రాకేశ్, కుమారస్వామి, శ్రీలత, సత్యం, విజయ్, సునిల్, రాకేశ్, పృథ్వీ, ప్రవీణ్, రాజేందర్, వెంకటేశ్, శ్రీనివాస్, చందు, కిశోర్, సందీప్, నరేష్, రాజు, దామోదర్ తదితరులు పాల్గొన్నారు

సమస్యలు పరిష్కరించాలని వినతి

మంచిర్యాలఅగ్రికల్చర్: నాలుగో తరగతి ఉద్యోగుల ప్రమోషన్లు, ఇతర సమస్యలు పరిష్కరించాలని నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ బి.సంతోష్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుమిత్, గోవర్ధన్ మాట్లాడుతూ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం బాడీ ఏర్పాటు అయిన సందర్భంగా గతంలో ప్రమోషన్లపై జిల్లా కలెక్టర్‌ను కలిసి విన్నవించామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, విజయ్, కవిత రాణి, తదితరులు పాల్గొన్నారు.

నేడు డివిజన్‌స్థాయి క్రీడా ఎంపిక పోటీలు

మంచిర్యాలటౌన్: గిరిజన బాలబాలికల క్రీడా ఎంపిక పోటీలు శనివారం ఉదయం 7:30 గంటలకు లక్సెట్టిపేట మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు డీటీడీవో వి.నీలిమ, గిరిజన క్రీడల అధికారి బండ జీవరత్నం తెలిపారు. అండర్–14, 17 క్రీడాకారులకు ఎంపిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. 16 ఆశ్రమ పాఠశాలల నుంచి 240 మంది బాలబాలికలు పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు.

కిష్టాపూర్ విద్యార్థులను అభినందించిన డీఈవో

జన్నారం: ఆన్‌లైన్ వ్యాసరచన పోటీల్లో రాష్ట్రస్థాయిలో బహుమతులు సాధించిన జన్నారం మండలం కిష్టాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులను డీఈవో యాదయ్య అభినందించారు. ఇటీవల వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో విజయ్, అక్షయ, సందేశ్ పాల్గొని రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. డీఈవో కార్యాలయంలో విద్యార్థులను శుక్రవారం సత్కరించారు. విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణించేలా కృషి చేసిన హెచ్ఎం రాజన్న, ఉపాధ్యాయులు సత్యనారాయణమూర్తి, మురళి, గోవర్ధన్, రాజన్న, మణిని డీఈవో అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా విద్యాధికారి

క్లుప్తంగా

కేంద్రమంత్రిని కలిసిన ఏమాజీ



పురుషోత్తం రూపాలతో ఏమాజీ

బెల్లంపల్లి: కేంద్రమంత్రి పురుషోత్తం రూపాలను శుక్రవారం బెల్లంపల్లికి చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ కలిశారు. పెద్దపల్లి జిల్లా రామగుండంకు వచ్చిన కేంద్రమంత్రిని నాయకులతో కలిశారు. బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో ఉన్న సమస్యలు, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడానికి తీసుకోవల్సిన చర్యలు, ఎత్తుగడలు తదితర అంశాలపై చర్చించారు.

కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జిని కలిసిన దుర్గాభవాని



ఠాక్రేతో దుర్గాభవాని

బెల్లంపల్లి: కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చైదరిని శుక్రవారం బెల్లంపల్లికి చెందిన రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కార్యదర్శి చొప్పదండి దుర్గాభవాని కలిశారు. ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో శుక్రవారం వారిని మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. బెల్లంపల్లి, నిర్మల్ అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన సమాచారాన్ని, రాజకీయ స్థితిగతులను వివరించారు.

అర్చకులకు రేపటి నుంచి శిక్షణ తరగతులు

ఆదిలాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ధూప దీప నైవేద్య అర్చకులకు అక్టోబర్ 1నుంచి 3వ తేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు దేవాదాయ ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ నవీన్‌కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. వైదిక స్మార్త, శైవ, పాంచరాత్ర, వీరశైవ, చాత్తాద శ్రీవైష్ణవ, గ్రామ దేవత ఆగమములకు సంబంధించిన శిక్షణ తరగతులను నిర్మల్ జిల్లా బాసర శ్రీజ్ఞాన సరస్వతి ఆలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. శిక్షణకు వచ్చే అభ్యర్థులకు భోజన సదుపాయం సైతం ఉంటుందని పేర్కొన్నారు. వైదిక స్మార్థ, శైవ ఆగమములకు చెందిన అర్చకులకు అక్టోబర్ 1న, పాంచరాత్ర, వీరశైవ అర్చకులకు 2న, చాత్తాద శ్రీవైష్ణవ, గ్రామ దేవత ఆగమములకు చెందిన వారికి 3న శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. విషయాన్ని అర్చకులు గమనించి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెస్ అసోసియేషన్ రద్దు

రెబ్బెన(ఆసిఫాబాద్): జిల్లా చెస్ అసోసియేషన్‌ను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఉమ్మడి జిల్లా చెస్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ ఈగ కనకయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న కోట సుధాకర్ అసోసియేషన్‌ను తన స్వార్థబుద్ధితో ఇష్టం వచ్చినట్లు వాడుతున్నట్లు విమర్శించారు. ఇష్టారీతిన టోర్నమెంట్లు నిర్వహిస్తూ సేకరించిన నిధులు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కారణంగా జిల్లా అసోషియేషన్‌ను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. జిల్లా అసోసియేషన్‌కు కొత్త కమిటీని నియమించేదాకా జిల్లాలోని చెస్ క్రీడాకారులు జాగ్రత్త వహించాలని సూచించారు. ఇప్పటినుంచి కోట సుధాకర్‌కు జిల్లా చెస్ అసోసియేషన్‌కు ఎలాంటి సంబంధం లేదని గమనించాలని కోరారు.

క్యాంపస్ నుంచే కొలువు

- ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు రూ.15లక్షల వార్షిక వేతనం

భైంసా(ముధోల్): శరవేగంగా విస్తరిస్తున్న సాంకేతిక రంగంలో బాసర ట్రిపుల్‌ఐటీ ఎంతోమంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలకు బాటలు వేస్తోందని వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ అన్నారు. ప్లేస్‌మెంట్‌లో రాణించిన కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్న ఇద్దరిని అభినందించారు. ట్రిపుల్ ఐటీలో చదువుతున్న విద్యార్థులు కామెర ప్రణవ్, మహమ్మద్ అమ్రాట్‌లకు రూ.15లక్షల వార్షిక వేతనం ఇస్తూ క్యాంపస్ ప్లేస్‌మెంట్ ఇచ్చారు. హుగో సేవ్ కంపెనీ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించగా ఎంపికైనవారు ఇంటర్న్‌షిప్ ద్వారా నెలకు రూ.35 వేలు అందించనుంది. అనంతరం రూ.15 లక్షల రూపాయల వార్షిక వేతనం ఇవ్వనున్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను డైరెక్టర్ సతీశ్‌కుమార్ అభినందించారు.



నిరుపేద కుటుంబం



మాది పెద్దపల్లి జిల్లా రామగుండం. నా తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుంటూ నన్ను చదివించారు. బాసర ట్రిపుల్‌ఐటీలో ఇంజనీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్నా. క్యాంపస్ ప్లేస్‌మెంట్ ఎంపికయ్యా. రూ.15లక్షల వార్షిక వేతనం ఇవ్వనున్నారు. కష్టపడి చదివినందుకు ప్రతిఫలం దక్కింది.

– కామెర ప్రణవ్, ట్రిపుల్‌ఐటీ విద్యార్థి

కష్టపడి చదివించారు



నిజామాబాద్‌కు చెందిన నేను ఎంతో కష్టపడి చదివా. మాతల్లి గృహిణి. తండ్రి మటన్ షాపు నడిపిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నా చదువు కోసం ఎంతగానో కష్టపడ్డాడు. క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లోఎంపిక కావడం ఎంతో ఆనందాన్నిస్తోంది. కష్టపడి చదివిన ప్రతీ ఒక్కరికి అవకాశాలు వస్తాయి.

– మహమ్మద్ అమ్రాట్, ట్రిపుల్‌ఐటీ విద్యార్థి

కమ్యూనికేషన్ స్కిల్స్ కీలకం



జాతీయ స్థాయి ఇన్‌స్టిట్యూట్‌లలో ఉండే కోర్సులను బాసర ట్రిపుల్‌ఐటీ అందిస్తోంది. కమ్యూనికేషన్ స్కిల్స్, ఆంగ్లభాషా నైపుణ్యం విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలను మెరుగుపరుస్తాయి. విద్యార్థులకు అమెరికా, ఆస్ట్రేలియా, న్యూ జిలాండ్ వంటి దేశాల్లో అవకాశాలు లభిస్తున్నాయి.

– వెంకటరమణ, బాసర ట్రిపుల్‌ఐటీ వీసీ

ఎన్నాళ్లీ ఎదురుచూపులు?

- పెండింగ్ వేతనాలు చెల్లించి ఉపాధి కల్పించండి
- నిరసనలో వేడుకుంటున్న నర్సరీ కూలీలు



నిరసన తెలుపుతున్న వాచ్‌మెన్, కూలీలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఏడాదిగా తమకు వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేటలో మంజూరైన స్థలంలో ప్రభుత్వ కళాశాల నిర్మాణం జరుగుతోంది. గతంలో ఈ స్థలం ఉద్యానవన శాఖ నర్సరీగా ఉండగా ఇందులో 33 ఏళ్లుగా ఓ వాచ్‌మెన్ నర్సరీ, మరికొందరు కూడా కూలీలుగా పని చేస్తున్నారు. వీరికి దాదాపు రెండు నెలలకు సంబంధించి వేతనాలు ఇవ్వకుండా ఏడాదిగా పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పుడు నర్సరీ స్థలంలో వైద్యకళాశాల నిర్మాణం చేపడుతుండగా ఉన్న ఉపాధి పోగా కనీసం కళాశాలలో ఉపాధి కల్పించాలని శుక్రవారం నిరసన వ్యక్తం చేస్తూ వేడుకున్నారు. తమకు వేతనం ఇవ్వని పక్షంలో కళాశాల పనులు అడ్డుకుంటామని తెలిపారు. ఉద్యానవన శాఖ నర్సరీలో మామిడి, సపోటా, ఆపిల్ బేర్, సర్వీ చెట్లు ఉండేవి. వీటి పోషణ, సంరక్షణకు గాను గ్రీన్ హౌజ్ ఆర్గనైజేషన్ అనే స్వచ్ఛంద సంస్థ 8 మంది కూలీలకు రూ.10 వేల చొప్పున వేతనం ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. రెండు నెలల పాటు నర్సరీలో అన్ని రకాలుగా పని చేసి నర్సరీని అందంగా తీర్చిదిద్దామని అయితే రెండు నెలల కష్టాన్ని ఇవ్వకుండా ఆ సంస్థ మోసం చేసిందని వాచ్‌మెన్ తోపాటు కూలీలు పేర్కొన్నారు. తమ వేతనాలు ఇవ్వని పక్షంలో వైద్య కళాశాల నిర్మాణ పనులు అడ్డుకుంటామని తెలిపారు. కాగా, వాచ్‌మెన్, కూలీల వేతనాలు గ్రీన్ హౌజ్ ఆర్గనైజేషన్ చెల్లించాల్సి ఉందని అది తమ పరిధిలో లేదని అయితే సంస్థ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తామని ఉద్యానవన శాఖ ఇన్‌చార్జి అధికారి సుప్రజ తెలిపారు.

32 ఏళ్లుగా పని చేస్తున్నా..



నెలకు రూ.300ల వేతనం నుంచి ప్రస్తుతం రూ.8 వేల వేతనంతో ఇప్పటివరకు అంటే దాదాపు 30 ఏళ్లుగా నర్సరీలో పని చేస్తున్నా. రెండు, మూడు నెలలకోసారి ఇచ్చే వేతనాలు సరిగ్గా రావడం లేదు. ఏడాదిగా వేతనాల కోసం చూస్తున్నా ఫలితం కనబడటం లేదు. కనీసం మెడికల్ కాలేజ్‌లో మాకు ఉపాధి కల్పించేలా చూడాలి.

– దొమ్మటి శంకరయ్య, వాచ్‌మెన్, గుడిపేట నర్సరీ

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

- ప్రమాదమా? కొట్టి చంపారా అనే అనుమానాలు..



చంద్రశేఖర్ (ఫైల్)



వరి పొలంలో చంద్రశేఖర్ మృతదేహం

జన్నారం: ఇంటి నుంచి బయటకు వెళ్లిన కొడుకు తిరిగిరాని లోకాలకు వెళ్లాడు. తెల్లారేసరికి వరి పొలంలో విగతజీవిగా పడి ఉన్న తీరు ప్రమాదానికి లోనయ్యాడా..లేదా ఎవరైన కొట్టి పడేశారా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతుడి తల్లి రాజవ్వ, ఎస్సై సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన మగ్గిడి రాజవ్వ, రాజయ్యకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. పెద్దవాడు. మగ్గిడి చంద్రశేఖర్ (30) ఉపాధి కోసం సౌదీ వెళ్లి గత సంవత్సరం క్రితం ఇంటికి వచ్చాడు. వివాహం చేసుకుని ఇంటివద్దే ఉంటున్నాడు. గురువారం స్నేహితులతో సరదాగా గడిపి రాత్రి 10 గంటల ప్రాంతంలో జన్నారం వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి బైక్‌పై వెళ్లాడు. రాత్రయినా ఇంటికి తిరిగి రాలేదు. పలుమార్లు ఫోన్ చేసిన స్విచ్ఛాఫ్ వచ్చింది. ఉదయాన్నే కల్లెడ చందు అనే వ్యక్తి వారి ఇంటికి వెళ్లి దుర్గం రాజేశ్వర్ పొలంలో ఎవరో పడి ఉన్నారని తెలిపాడు. కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి పరిశీలించి చంద్రశేఖర్ మృతదేహాన్ని గుర్తించారు. జన్నారం వెళ్లి వస్తానని కానరాని లోకాలకు వెళ్లావా.. అని కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి. విషయం తెలుసుకున్న ఎస్సై సతీశ్ సంఘటన స్థలానికి చేరుకున్నాడు. మృతదేహాన్ని పరిశీలిస్తే బైక్ డోమ్ పగిలి ఉంది. వరి పొలంలో పడి ఉన్న చంద్రశేఖర్ మృతదేహం ముక్కు నుంచి రక్తం కారి ఉంది. పరిశీలించిన కుటుంబీకులు రోడ్డు ప్రమాదమా.. లేక ఎవరైన కొట్టి చంపారా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతుడి తల్లి రాజవ్వ ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

బెల్లంపల్లి: కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటం సాగించాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. బెల్లంపల్లి సింగరేణి జీఎం కార్యాలయం ఆవరణలో శుక్రవారం నిర్వహించిన కుల నిర్మూలన సదస్సులో ఆయన మాట్లాడారు. శ్రమ ఏ కులాన్నైనా, మతాన్నైనా ఐక్యం చేయగలుగుతుందన్నారు. సంఘటిత, అసంఘటిత కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగుల శ్రమను బట్టి ఐక్యత ఆధారపడి ఉంటుందన్నారు. కానీ కులాన్ని రాజకీయాలు, పార్లమెంటరీ విధానం ఓటు బ్యాంకుగా వాడుకోవడం శోచనీయమన్నారు. కుల నిర్మూలన కోసం బుద్ధుడు, మహాత్మా జ్యోతిబాపూలే, బీఆర్ అంబేద్కర్, పెరియార్ రామస్వామి, మరెందరో పాటుపడ్డారని పేర్కొన్నారు. ప్రస్తుత పాలకులు కులాన్నీ విభజించి ఓటు బ్యాంకుగా వాడుకోవడం దారుణమని తెలిపారు. ఇఫ్టూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండీ చాంద్‌పాషా, నాయకుడు జాఫర్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఆర్.చరణ్, నాయకులు పాల్గొన్నారు.

మహిళను దుర్భాషలాడిన వ్యక్తికి జరిమానా

మందమర్రిరూరల్: మహిళను దుర్భాషలాడి, చెప్పుల దాడి చేసిన వ్యక్తికి రూ. 5 వేలు జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి ఉపనిషద్వని శుక్రవారం తీర్పు చెప్పారు. ఎస్సై చంద్రకుమార్ కథనం ప్రకారం.. ఊరుమందమర్రికి చెందిన మహిళకు నిందితుడు బాదె పోశం డబ్బులు ఇవ్వాల్సి ఉంది. డబ్బులను అడిగినందుకు 2016 ఫిబ్రవరి 1న దుర్భాషలాడి చెప్పుతో కొట్టాడు. బాధితురాలు అప్పటి ఎస్‌హెచ్‌వో సతీశ్‌కు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కేసు విచారణలో పీపీ షాహిన్ సుల్తానా ఆరుగురు సాక్షులను మంచిర్యాల కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేయడంతో రూ.5 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించారు. సాక్ష్యాలు ప్రవేశపెట్టి నిందితుడికి జరిమానా పడేలా చేసిన పోలీసు సిబ్బందిని రామగుండం సీపీ రెమా రాజేశ్వరి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని వల్లకొండ పెట్రోల్‌పంపు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పెంచికల్‌పేట నుంచి కాగజ్‌నగర్‌కు పోదూరి వెంకటేశం, పొట్టి గణపతి మోపెడ్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో కాగజ్‌నగర్ నుంచి పెంచికల్‌పేటకు వెళ్తున్న టాటాఏస్.. మోపెడ్‌ను ఢీకొట్టింది. దీంతో వెంకటేశం, గణపతికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌లో కాగజ్‌నగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు డ్రైవర్ షేక్ అబ్దుల్ రియాజ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

ఆసిఫాబాద్అర్బన్: జిల్లాకేంద్రంలోని దస్నాపూర్ కాలనీలో తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గత రెండురోజుల క్రితం ఇంటికి తాళం వేసి రాజయ్య తన కుటుంబ సభ్యులతో వేములవాడ పుణ్యక్షేత్రానికి వెళ్లారు. శుక్రవారం తిరిగి ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోని బీరువాలోని సామగ్రి చందరవందరగా పడి ఉండడం, 14 తులాల బంగారం, 10 తులాల వెండి, రూ. 50వేల నగదు చోరీకి గురికావడంతో బాధితులు పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ వెంకటరమణ ఆధ్వర్యంలో డాగ్‌స్క్వాడ్, ఫింగర్ ప్రింట్ నిపుణులు పోలీసులను సంఘటన స్థలానికి రప్పించారు. చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి, కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: బూర్గుడలోని గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దివ్యారాణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కెమిస్ట్రీ, బోటనీ, కంప్యూటర్ సైన్స్, జువాలజీ, కామర్స్, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. పీజీ సెట్ నెట్, పీహెచ్‌డీ అర్హత గల మహిళా అభ్యర్థులు అక్టోబర్ 4వ తేదీ లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అక్టోబర్ 7న డెమో క్లాస్ నిర్వహించి ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.

స్కాలర్‌షిప్ కోసం..

ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్) కోసం ఎనిమిదో తరగతి విద్యార్థులు అక్టోబర్ 13వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో అశోక్ ఓ ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 10వ తేదీన అర్హత పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు.

శాశ్వత పరిష్కారం చూపించాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మందమర్రిరూరల్: పట్టణంలోని యాపల్ ఏరియాలో జీఎం ఆఫీస్ మూలమలుపు వద్ద చాలామంది బస్సు కోసం రోడ్డు దాటే క్రమంలో ఐరన్ రేకులు దాటడంతో ఇబ్బంది పడుతున్నారని యాపల్ ఏరియా బీఆర్ఎస్ నాయకుడు ఎండీ అబ్బాస్ తెలిపారు. ఐరన్ రేకులు తొలగించి శాశ్వత పరిష్కారం చూపించాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్యనారాయణను శుక్రవారం కలిసి వినతిపత్రం అందించారు. నర్సయ్య, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

‘గుర్తింపు’ ఎన్నికలు జరిగేనా?

- ఎన్నికలపై ఆసక్తి చూపని యూనియన్లు
- సుప్రీంకోర్టుకు వెళ్లే యోచనలో యాజమాన్యం



కాసిపేట: ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటికి కార్మిక శాఖ ముందుకొచ్చినా సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటివరకు ఎన్నికలు నిర్వహించాలని పోరాటాలు చేసిన యూనియన్లు ప్రస్తుతం ఎన్నికలపై ఆసక్తి చూపడం లేదు. ప్రభుత్వ ఒత్తిడితో యాజమాన్యం సుప్రీంకోర్టుకు వెళ్లే యోచనలో ఉండటంతో ఎన్నికలపై నీలినీడలు కమ్ముకోనున్నాయి. ఎన్నికలు నిర్వహించాలని కోర్టు ఆర్డర్‌తో ఈనెల 27న ఎన్నికల కమీషన్ నిర్వహించిన సమావేశానికి ఏఐటీయూసీ, బీఎంఎస్ మినహా కార్మిక సంఘాలు హాజరుకాకపోవడం అనుమానాలకు బలం చేకూరుతుంది. యాజమాన్యం కార్మిక సంఘాలను రాకుండా సింగరేణి భవన్‌లో కూర్చోపెట్టింది అనే విమర్శలు ఉన్నాయి. ఎన్నికల నిర్వహణపై కోర్టుకు వెళ్లిన ఏఐటీయూసీ మాత్రమే ముందుకు వెళ్లే ప్రయత్నం చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహిస్తే ఫలితాల ప్రభావం చూపుతాయని ప్రభుత్వం శ్రద్ధపెట్టడం లేదు. దీంతో యాజమాన్యంపై ఒత్తిడి చేయడం, సాధారణ ఎన్నికల నేపథ్యంలో బందోబస్తు నిర్వహణ కష్టంగా మారుతుందని కలెక్టర్లు, అధికారుల ద్వారా నివేదికలు సమర్పించనున్నాయి. దానికి తోడు సింగరేణిలో అన్ని కార్మిక సంఘాలకు సమాన హోదా కల్పిస్తున్నట్లు ప్రకటించడంతో యూనియన్లు అక్కడితో సరిపెట్టుకున్నాయి. సమాన హోదా కార్మికుల సమస్యలపై మాట్లాడేందుకు తప్ప మైన్‌కమిటీ, సేఫ్టీ కమిటీ సమావేశాలకు అందరిని పిలుస్తారా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కాగా, అక్టోబర్ 28న ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా శనివారం డ్రాఫ్ట్ ఓటరు జాబితా యూనియన్లకు రిటర్నింగ్ అధికారులకు సమర్పించడం, అక్టోబర్ 3న డ్రాఫ్ట్ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, 4న అభ్యంతరాలపై రిటర్నింగ్ అధికారి నిర్ణయం తీసుకోవడం, 5న యాజమాన్యం ఫైనల్ జాబితా ప్రదర్శన చేయడం, 6న నామినేషన్ల స్వీకరణ, 7న నామినేషన్ల స్వీకరణకు అఖరు తేది ఉండటంతో 6వ తేదీ వరకు అయోమయం తప్పడం లేదనే అనుమానాలున్నాయి. నామినేషన్ల పర్వం ప్రారంభమైతే ఎన్నికలపై ఆశలు ఉంటాయని లేకుంటే లేనట్లేనని కార్మిక నాయకులు, కార్మికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

పరిహారం కోసం తిప్పించుకుంటున్నారు

- ఓసీపీ నిర్వాసితుడి ఆవేదన



దరఖాస్తు పత్రాన్ని చూపిస్తున్న కన్నం పోశం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ నిర్వాసితుడైన తనకు నష్టపరిహారం చెల్లించకుండా అధికారులు కార్యాయాల చుట్టూ తిప్పించుకుంటున్నారని సింగపూర్‌కు చెందిన కన్నం పోశం ఆవేదన వ్యక్తం చేశాడు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సింగపూర్ శివారులోని సర్వే నెంబర్ 70లో గుంటన్నర భూమిలో రేకులషెడ్డు ఇల్లు నిర్మించుకుని నివాసముంటున్నానని తెలిపారు. ఆరు రూములతో తన కుటుంబ సభ్యులు ఉంటున్నారని తెలిపారు. ఓపెన్‌కాస్ట్‌తో ఇళ్లు ముంపునకు గురైందన్నారు. 2014లో దీనికి సంబంధించిన జీవో డబ్బులు వచ్చాయని తెలిపారు. కానీ ఇంకా ఇంటి నిర్మాణ పరిహారం, ఇంటి అడుగు స్థలానికి డబ్బులు రాలేదన్నారు. అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరాడు.

జన్యుపరమైన వ్యాధులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కె. రాజా

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో జన్యుపరమైన వ్యాధులపై శుక్రవారం అవాహన కల్పించారు. రీజనల్ సైన్స్ సెంటర్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ కె.రాజా, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం టెక్నికల్ ఆఫీసర్ తిరుసెల్వం ఆధ్వర్యంలో జన్యుపరమైన వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జీన్ హెల్త్ కనెక్ట్ మొబైల్ సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌సీవో కె. స్వరూపరాణి, పాతమంచిర్యాల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.నాగమణి, కళాశాల ప్రిన్సిపాల్ డి.సుమతి, వైస్ ప్రిన్సిపాల్ కె.శివలీల, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.పూర్ణిమ పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

శ్రీరాంపూర్: సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్ట్ కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం(సీఐటీయూ) ఆధ్వర్యంలో నిర్వహించారు. యూనియన్ డివిజన్ కార్యదర్శి మహేందర్ మాట్లాడుతూ సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచుతామని గతంలో గోదావరిఖనిలో జరిగిన బహిరంగ సభలో మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో 22ను ఇప్పటివరకు గెజిట్ చేయడం లేదని, దీనివల్ల కాంట్రాక్ట్ కార్మికులు సరైన వేతనం వందకు శ్రమదోపిడి గురవుతున్నారన్నారు. అక్టోబర్ 1న మందమర్రి పర్యటనకు వస్తున్న మంత్రి కేటీఆర్ కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేస్తూ ఆదేశాలివ్వాలని డి మాండ్ చేశారు. యూనియన్ నాయకులు సమ్మయ్య, నరేశ్, సంపత్, శ్రీను, రాజేందర్ పాల్గొన్నారు.

ఫిజిక్స్‌లో డాక్టరేట్



దాసరి స్వాతి

మందమర్రిరూరల్: మందమర్రిలోని యాపల్ ప్రాంతానికి చెందిన దాసరి స్వాతి ఫిజిక్స్‌లో డాక్టరేట్ సాధించింది. దాసరి సంపత్-అహల్య దంపతుల కుమార్తె స్వాతి.. స్థానిక సింగరేణి హైస్కూల్‌లో పదో తరగతి చదివింది. అనంతరం గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి 2019లో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాలలో (వికారాబాద్) ఫిజిక్స్ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించింది. చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో డాక్టర్ ఎస్ కుమారస్వామి పర్యవేక్షణలో ఎక్స్‌ప్లోరింగ్ మల్టీ ఫంక్షనల్ ప్రాపర్టీస్ ఆఫ్ మాంగనీస్ బేస్ట్ మల్టీ ఫెర్రాయిక్స్, ఇన్‌సైట్స్ ఫ్రం స్ట్రక్చరల్ స్పెక్ట్రోస్కోపిక్ డై ఎలక్ట్రిక్ అండ్ మాగ్నటిక్ ప్రాపర్టీస్ అనే అంశంపై ఐఎస్‌బీఎం యూనివర్సిటీలో సిద్ధాంత గ్రంథం సమర్పించి పీహెచ్‌డీ పొందారు. శుక్రవారం స్వాతికి డాక్టరేట్ ప్రదానం చేశారు. తన ను ప్రోత్సహిస్తూ సహకారం అందించిన యూనివర్సిటీ చాన్స్‌లర్, రిజిస్ట్రార్, సిద్ధాంతకర్త, ప్రిన్సిపాల్, తన భర్త సదానంద్‌కు స్వాతి కృతజ్ఞతలు తెలిపారు.

డప్పు కొట్టి.. పాడె మోసిన మాజీ విప్ ఓదెలు



గుండు మల్లయ్య అంతిమయాత్రలో దప్పుకొడుతున్న మాజీ విప్ ఓదెలు

జైపూర్: సామాన్య కార్యకర్త అనారోగ్యంతో మరణించగా ఆయన అంతిమయాత్రలో పాల్గొన్న చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, మాజీ విప్ నల్లాల ఓదెలు డప్పుకొట్టి.. పాడె మోశారు. భీమారం మండలం కొత్తపల్లి మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ గుండు తిరుపతి తండ్రి గుండు మల్లయ్య(90) జైపూర్ మండలం మిట్టపల్లి గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందాడు. వారి ఇంటికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే ఓదెలు ఆయన పార్థివదేహం వద్ద నివాళులర్పించి వారి కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు.

బీజేపీ మండల అధ్యక్షుడిపై దాడికి యత్నం

బెల్లంపల్లిరూరల్: బీజేపీ మండల అధ్యక్షుడు గజ్జెల్లి రాజ్‌కుమార్‌పై కొందరు యువకులు దాడి చేశారని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి కథనం ప్రకారం.. మండలంలోని చంద్రవెల్లిలో గృహలక్ష్మి, బీసీబంధు పథకాల్లో అనర్హులకు కేటాయిస్తున్నారని ‘మన చంద్రవెల్లి కుటుంబం ’అనే వాట్సప్ గ్రూప్‌లో రాజ్‌కుమార్ పోస్టు చేశాడు. అక్రమాల ఆధారాలు చూపించాలని బీఆర్ఎస్‌కు చెందిన కొందరు యువకులు అతన్ని ఇంటికి వెళ్లి అడిగారు. తనకు సమయం పడుతుందనగా సదరు యువకులు నా సెల్‌ఫోన్ లాక్కుని చొక్కా పట్టుకుని దాడి చేశారని 100 డయల్‌కు ఫోన్ చేసి చెప్పారు. తాళ్లగురిజాల ఎస్సై నరేశ్, పోలీసులు అక్కడి చేరుకోగా, ఇంతలో సదరు యువకులు వెళ్లిపోయారు. తనపై, తన తల్లిపై దాడి చేశారని రాజ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. సదరు యువకులు సైతం రాజ్‌కుమార్‌పై ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వెంకటకృష్ణ, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీకృష్ణదేవరాయలు రాజ్‌కుమార్‌ని పరామర్శించారు. కాగా, ఎస్సై నరేశ్‌ను వివరణ కోరగా రాజ్‌కుమార్, సదరు యువకులు తమ ఫిర్యాదులను వెనక్కి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

కేటీఆర్ పర్యటన విజయవంతం చేయాలి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు, ఐటీ మంత్రి కేటీఆర్ మొట్ట మొదటిసారిగా ఆదివారం విచ్చేస్తున్న చెన్నూర్ పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ చైర్మన్ డాక్టర్ కొమ్ము అశోక్‌యాదవ్ పిలుపునిచ్చారు. మండలం గుడిపేటలోని పశుసంవర్థక శాఖా జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బహిరంగసభకు యాదవులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా సహకార యూనియన్ డైరెక్టర్లు మహేశ్‌యాదవ్, సదానందంయాదవ్, పిండి నరేశ్‌యాదవ్, పోచకుమార్‌యాదవ్, మల్లేశ్‌యాదవ్ పాల్గొన్నారు.